
# ఒయ్యారి భామ



"డాక్టరుగారూ! ఎట్లాగైనా మీరు నా మొహం మార్చాల్సిందే" అన్నాడు రమాకాంత్. డాక్టర్ చతుర్వేదుల వ్యాస ప్రసాదం గారి ఆసుపత్రిలో ఆయనకెదురుగా కూర్చుని అడుగుతున్న వ్యక్తి రమాకాంత్. యూనివర్శిటీలో సైకాలజీ రీడర్. 'మానవ మనస్తత్వంపై ప్రకృతి పాత్ర' అనే అంశం మీద పరిశోధన చేసి, డాక్టరేట్ సంపాదించాడు.

"మీ మొహానికేం? కొస్త నల్లబడ్డ చంద్రబింబంలాగుంటేను?" అన్నాడు వ్యాస ప్రసాదం.

"కాస్తేమిటి? చాలా నల్లబడింది."

"పోనీ, మీ కభ్యంతరం లేకపోతే మబ్బులచాటు చంద్రబింబం అనుకుందాం. కణత మీద చిన్న మచ్చ కూడా ఉంది కదా? పోలిక సరిగ్గా సరిపోతుంది."

"నా కభ్యంతరం లేదు గానీ చంద్రుడికే అభ్యంతరం ఉంటుంది. దయచేసి, ఇంకొంచెం జాగ్రత్తగా చూడండి. మీకూ అభ్యంతరం కలుగుతుంది."

టేబుల్ మీద ఒక పక్క ప్రిస్క్రిప్షన్ పాడ్ మీదున్న భూతద్దం తీశాడు డాక్టర్. రమాకాంత్ డాక్టర్‌కి ఎదురుగా ఉన్న కుర్చీ నుంచి ఆయనకి దగ్గరగా వున్న స్టూల్ మీదకి మారాడు. డాక్టర్ భూతద్దంతో రమాకాంత్ మొహాన్ని జాగ్రత్తగా పరిశీలించాడు. ఆయన ఊహించని అంశమేదో పేషెంట్ మొహం మీద కనిపించింది. కనుబొమలు ముడిపడ్డాయి.

"ఇదేమిటి? మొహమంతా దద్దురు దద్దురుగా ఉంది?" అడిగాడు డాక్టర్.

"ఇదేమిటో మీరు చెపుతారనే ఇవాళ సెలవు కూడా పెట్టి వచ్చాను. ఎవర్నడిగినా పేరులోనే చర్మవ్యాధిని కలిగిన మిమ్మల్ని మించిన స్కిన్ స్పెషలిస్ట్ లేడని చెప్పారు. గేటుముందు మీ నేమ్ బోర్డ్ చూడంగానే నా అభిప్రాయం బలపడింది" అన్నాడు రమాకాంత్.

లోపలికి రాబోయే ముందు తను చూసిన బోర్డు కంటిముందు కదలాడింది. దాని మీద డా. చ. వ్యా. ప్రసాదం అని వుంది.

"మీ అభిప్రాయం తప్పు. చాలామందిలాగే మీరూ అనుకున్నట్టు నేను చర్మవ్యాధుల ప్రసాదాన్ని కాదు" అని తన అసలు పేరు చెప్పాడు. "తెలుగు భాషంటే నాకు మక్కువ ఎక్కువ. అందుకని తెలుగులో బోర్డు రాయించాను" అన్నాడు నవ్వుతూ."అదలా ఉంచుదాం. మొహం దురద పెడుతుందా?"

"భయంకరంగా. ఏదో రాక్షసి రక్కుతున్నట్టనిపిస్తుంది. మొహం తీసి ప్రక్కన పెట్టాలన్పిస్తుంది. ఒక్కోసారి మొహాన్ని వదిలేసి ఎక్కడికైనా పారిపోదాం అనిపిస్తుంది. ప్రస్తుతం చాలా డిప్రెషన్‌లో ఉన్నాను"

"విచిత్రంగా వుంది. ఇంకా?"

"మరీ తీవ్రంగా ఉన్నపుడు మొహం ఏడుస్తుంది గూడా."

"అంటే, కన్నీళ్లు కార్చుతుందా?" అడిగాడు డాక్టర్, అతని మొహం పరీక్షగా చూస్తూ.

"కన్నీళ్లు కాదు, ముఖ-నీళ్లే" అన్నాడు రమాకాంత్.

డాక్టర్ తల విదిలించాడు.

"వ్యాధి తీవ్రతలోనైనా దుష్టసమాసం తగదు. 'ముఖ బాష్పాలు' అనండి, బాగుంటుంది. అన్నట్టు బాష్పాలు అన్నప్పుడు 'బా'కు వత్తుండదు సుమా!" చెప్పాడు సీరియస్‌గా.

అప్పటికర్థమైంది రమాకాంత్‌కి డాక్టర్ టేబుల్ మీద 'శబ్ద రత్నాకరం' ఎందుకుందో.

"సరే, చెప్పండి, ఎప్పుడు బడితే అప్పుడేడుస్తుందా, దాని కేమన్నా మూడ్ ఉందా?" అడిగాడు డాక్టర్ వివరంగా.

"మూడ్ కాదు గానీ సీజన్ ఉంది. ఈ ముఖ-దద్దురు గానీ, ముఖ బాష్పాలు గాని శ్రావణమాసంలో మొదలవుతున్నాయి."

డాక్టర్ ప్రసాదం మళ్లీ తల విదిలించాడు అసహనంగా.

"మళ్లీ దుష్ట సమాసం. ముఖ దద్దురు అనకూడదు. మరి..." అని ఆగిపోయాడు, సరైన మాట తట్టక పోవటం చేత. "పోన్లెండి. ఏడవటమంటే, కుమిలి కుమిలి ఏడుస్తుందా?" అడిగాడు మళ్లీ. ఒక ప్రిస్క్రిప్షన్ కాగితం తీసి, దానిమీద 'శ్రావణమాసం' అని రాసుకున్నాడు.

"పెద్ద ఏడుపంటూ ఏం ఉండదులెండి. కళ్లు చెమర్చినట్టే కొంచెం తడితడిగా."

"మరి జ్యేష్ఠమాసంలో?" అడిగాడు డాక్టర్, వేసవి కాలం గురించి. "జ్యేష్ఠ మాసంలో ఏడుపు మానేస్తుంది. శ్రావణ, భాద్రపద, ఆశ్వయుజ, కార్తీక మాసాల్లో ఎక్కువగా రోదిస్తుంది."

"ఇంకా చెప్పండి మీ ఇబ్బంది గురించి"అడిగాడు వ్యాసప్రసాదం ఆసక్తిగా. "అలా ఏడుస్తున్నపుడు తక్కిన శరీర అవయవాల స్పందన ఎట్లా ఉంటుంది?"

ఆయనకి ఈ కేసు కొత్తగా ఉంది. ఆ రోజు పేషెంట్లు అంతగా లేకపోవటం వల్ల రమాకాంత్‌కి ఎక్కువ సమయం కేటాయించాడు.

రమాకాంత్ ఒక్కో విషయం గుర్తుకు తెచ్చుకున్నాడు. "మొహం ఏడుస్తున్నపుడు ఇంకేవీ కాదు గానీ, చేతులు, కాళ్లు మాత్రం సానుభూతి చూపిస్తుంటాయి. అన్నట్టు మెడ కూడా."

డాక్టర్ ప్రసాదం కాగితం మీద 'శ్రావణమాసం' అనే మాట కింద 'చేతులు, కాళ్లు - సానుభూతి' అని రాసుకున్నాడు. రమాకాంత్ చేతుల్ని, కాళ్లని జాగ్రత్తగా పరిశీలించాడు. అక్కడక్కడ ఎర్రటి దద్దురు కన్పించింది. అతని తిండి అలవాట్ల గురించి అడిగాడు డాక్టర్. ఇంకేవైనా శారీరక అనారోగ్యాలున్నాయేమో ఆరా తీశాడు.

"ఇదొక్కటి చాలదా డాక్టర్ గారూ! నా ప్రాణం తియ్యటానికి? జీవితంలో ఆనందం లేకుండా పోయింది. దయచేసి నా కోరిక మన్నించి ముఖభిక్షపెట్టండి."

వ్యాస ప్రసాదం చాలసేపు ఆలోచనా ముద్రలో ఉండిపొయ్యాడు. చివరికి తల పంకించి ఇలా అన్నాడు. "స్పష్టంగా చెప్పాలంటే మీ వ్యాధి లక్షణం నాకంతుబట్టలేదు. మామూలు చర్మవ్యాధి కాదిది. ఏదో విశిష్టమైన - అవును - విశిష్టమైన వ్యాధి. నాక్కొంచెం సమయమివ్వండి. వచ్చే శనివారం రండి. ఈలోగా కొంచెం ఉపశాంతికి మామూలు మందులు రాస్తున్నాను." అని ప్రిస్క్రిప్షన్‌లో 'మెట్రిల్', 'ఇ-బాస్ట్', 'డిసోవెన్' అని ముచ్చటగా మూడు మందులు అచ్చ తెలుగులో రాసి ఇచ్చాడు.

"మొహం మార్చే విషయం తర్వాత. తొందరొద్దు. నేనైతే ఇప్పటిదాకా చర్మం మాత్రమే మార్చాను. మొహం మొత్తం మార్చటమంటే అందులో సాధకబాధకాలు బోలెడుంటాయి."

❖ ❖ ❖

"సింగడు అద్దంకి పోనూ పొయ్యాడు, రానూ వచ్చాడంట" అంది భార్య ప్రమీల రమాకాంత్ ఇంట్లోకి అడుగు పెట్టగానే, మూతి మూడు వంకర్లు తిప్పుతూ.

"సింగడెవరు? అద్దంకి ఎక్కడ?" పరాకుగా అడిగాడు, వరండాలో చెప్పులు వదిలేస్తూ.

"నా మొహం. మొహం మార్పించుకొస్తానని పొద్దుననగా పోయిన వాళ్లు చేతులూపు కుంటూ తిరిగొచ్చారన్నమాట" అంది.

"ఏదీ, వీలు కాందే" అన్నాడు రమాకాంత్ సోఫాలో కూలబడుతుండగానే కూతురు అనుపమ - ఐదో తరగతి చదువుతుంది - గబగబా దగ్గరికి వచ్చి తండ్రిని ఎగాదిగ చూసింది. పక్కనే కూర్చుని రమాకాంత్ చేతులు పట్టుకొని అడిగింది.

"డాడీ డాడీ! మరే నా బొమ్మలన్నీ పాతబడిపోయినయ్. మొహం మారిస్తే నీ పాత మొహం నాకు ఆడుకోటానికియ్యవా?"

"అట్లాగే తల్లీ!" అన్నాడు రమాకాంత్ కూతుర్ని దగ్గరకి తీసుకుంటూ. 'నా మొహం మీద దీనికున్న ప్రేమ ప్రమీలకి లేదు' అనుకున్నాడు.

చాలా చిరాగ్గా వుంది. మొహమంతా దురద దురదగా, బురద బురదగా ఉంది. ఎవరినన్నా పట్టుకొని గట్టిగా కొరికెయ్యాలని వుంది. బాధగా వుంది. భయంగా ఉంది.

పెందరాళే భోంచేసి పడుకోవాలన్పించింది గాని, యూనివర్శిటీలో చదవాల్సిన సెమినార్ పేపరు ఇంకా తయారు చెయ్యలేదని గుర్తొచ్చింది. భోంచేసి కాగితాలు ముందేసుకున్నాడు. 'ఏ డైలాగ్ బిట్వీన్ ద ట్రీ అండ్ ద మాన్' అనే విషయం. సృష్టి మొదలు ఇప్పటిదాకా మనిషే చెట్టు చేమల్తో మాట్లాడుతున్నాడని, వాటి స్వరూపస్వభావాల్ని మార్చగలుగుతున్నాడని అతని ప్రతిపాదన. మొక్కలకు అంటుగట్టడం, హైబ్రీడ్ రకాలు సృష్టించడం, జన్యుపరివర్తనం దాకా మనిషి చెట్టు మీద జరిపిన ప్రయోగాలన్నీ తన రాతలో పేర్కొన్నాడు. అయితే చెట్టు మాత్రం మనిషి విషయంలో నిర్లిప్తంగా, మౌనంగా ఉండిపోతుందని అతని సిద్ధాంతం. వ్యాసం పూర్తి చెయ్యగానే అందులో విలువైన ప్రతిపాదనలు చేసినందుకు సంతృప్తి కలిగింది. అయితే ఆ మానసిక శ్రమ వల్ల మొహం మీద, చేతుల మీద ఎలర్జీ ఇంకొంచెం ఎక్కువైనట్టు గుర్తించాడు.

ఆ రాత్రి అతనికి చిత్రమైన కల వచ్చింది. కలలో ఒక అందమైన నడికారు వనిత నవ్వుతూ కనబడింది. ఆమె శరీరవర్ణం ఆకుపచ్చన. ఒంటినిండా చేతులే. గాలిలో అటు ఇటు హాయిగా స్వేచ్ఛగా ఊగుతున్నాయి. చేతులకున్న గోళ్లు - తెల్లటి గోళ్లు - మెరిసిపోతున్నాయి. చేతులూపుతూ ఆ స్త్రీ రమాకాంత్‌ని కౌగిలించుకొమ్మని పిలుస్తుంది. తెలీని భయంతో ఒక్కో అడుగే వెనక్కి వేస్తున్నాడు. దబాల్న మంచంమీద నుంచి కిందబడేపాటికి మెలకువ వచ్చింది.

"డబుల్ కాట్ ఉన్నా మీకు చోటు చాలటం లేదా? ఇక నుంచి కిందే పడుకోండి. మళ్లీ మళ్లీ పడితే దెబ్బలు తగుల్తాయి" అంది నిద్రలేచిన ప్రమీల ఆవలిస్తూ, కొంచెం చిరాగ్గా.

రమాకాంత్ అయోమయంగా తలూపాడు. ఆ రాత్రికింక నిద్ర పట్టలేదు. మళ్లీ మళ్లీ ఆ మోహినే కళ్ల ముందు కదలాడుతుంది. గోళ్లతో రక్కినట్టు మొహమంతా ఒకటే బాధ.

❖ ❖ ❖

ప్రపంచంలో ఏ పరిణామమైనా ఏదో ఒకరోజే మొదలవుతుంది గదా! రమాకాంత్ వదన బాధకూడా అంతే. (వదన బాధ మంచి సమాసమే). అన్ని రోజుల్లాగే ఆ రోజూ ఆలస్యంగానే నిద్రలేచినా ఎందుకో ఆ పూట ఉదయ వాహ్యాళి చేద్దామనిపించింది. వయస్సేమో నలభై దాటింది. ఆ మధ్య ఒళ్లు మాట వినక, పొట్ట పెరిగిపోయింది. చల్లటి వానాకాలం వాతావరణం. కాఫీ గూడా తాక్కుండా బయటికి నడిచాడు. 'పోనీలే, నేనే రెండోసారి తాగుతా' అనుకుంది ప్రమీల.

ఆ వీధిలో పెద్దగా ఇళ్లు లేవు. ఊరి చివర కాలనీ. ఇంటికి ఇంటికి మధ్య కొన్ని ఖాళీ స్థలాలు. అక్కడ సెకండ్ ఫేజ్‌లో ఇళ్లు కట్టాల్సి వుంది. పది పదిహేను ఇళ్లు దాటిన తర్వాత అంతా ఖాళీ ప్రదేశమే. నిజానికి కాలనీ తను పని చేసే యూనివర్శిటీకి చాలా దూరం. అయితే యూనివర్శిటీ బస్సు ఉండటం వల్ల ఇబ్బంది లేదు.

'వాతావరణం బాగుంది' అనుకున్నాడు. 'బాగుంది వాతావరణం' అని మళ్లీ అనుకున్నాడు. చిరు చలిగా ఉంది. మబ్బులు పట్టిన శ్రావణ మాసపు ఆకాశం. పైన వానతూనీగ లెగురుతున్నాయి. 'ఇవాళ ముసురు పట్టొచ్చు' అనుకున్నాడు. దారికి అటు, ఇటు అంతా విశాలమైన పచ్చిక నేలలు. కొంచెం దూరంగా పొలాలు. తిరిగిచూస్తే కాలనీ నుంచి అప్పుడే మైలు దూరం వచ్చినట్టు గమనించాడు. 'తిరిగి వెళ్లాలి. వానొస్తే కష్టం' అనుకున్నాడు. తూనీగలు బాగా కిందగా ఎగురుతున్నాయి. 'ఒక తూనీగని పట్టుకుంటే బాగుంటుంది. ఎప్పుడో చిన్నప్పటి సరదా' అనుకున్నాడు. ఒక తూనీగ వెంటబడితే అది ఎగురుతూ ఎగురుతూ దారి పక్క పెద్ద పెద్ద మొక్కల మీదకి పోయింది. మెల్లగా అటు నాలుగడుగులు వేశాడు. ఏవేవో తను ఇంతకు మునుపు చూడని మొక్కలు. రెండు మూడు అడుగుల ఎత్తున పెరిగి వున్నాయి. ఒక మొక్క మీద వాలిన తూనీగని చటుక్కున పట్టుకున్నాడు. అది కాళ్లతో, నోటితో రమాకాంత్ వేలిని పట్టుకొని విదిలించుకోవాలని చూస్తుంది. రమాకాంత్ చెయ్యి ఆ మొక్క కొమ్మకి తగిలింది. దాన్నిండా తెల్లటి చిన్న చిన్న పూలు. 'అందంగా ముద్దుగా బంతి మొక్కలాగే వుంది, ఎప్పుడూ చూళ్లేదే' అని ఒక పువ్వు కోసి గట్టిగా వాసన పీల్చాడు. ఏ సువాసన రాలేదు. 'పూలచెట్టు, వాసన రాకపోవడం విచిత్రంగా ఉందే' అనుకున్నాడు. రెండు ఆకులు తుంపి చూస్తే కొంచెం గమ్మత్తైన పసరు వాసన వేసింది. వెనక్కి తిరగ్గానే ఎవరో కిసుక్కున నవ్వినట్టు అన్పించింది. గాలిలో ఏదో భాష తెలియని గానం వినపడుతుంది. శరీరం మెలికలు తిరుగుతున్న అనుభూతి. తిరిగి చూస్తే ఆ మొక్క గాలికి

కదుల్తూ వుంది. ఆ ప్రదేశం నిండా అలాంటి మొక్కలే. 'నా భ్రాంతి గాని ఈ మొక్క-చెట్టు నవ్వి ఉండదు' అనుకున్నాడు. చెట్టు మనిషి విషయంలో స్పందిస్తుందా? దానికి తనలాగే స్పందించే గుణం ఉంటే నవ్వటం, పాడటం ఏమిటి. ఇప్పటికెన్ని సంగతులు మాట్లాడుకునే వాళ్లో.

ఆరోజు సీనియర్స్ క్లాసులో పాఠం చెపుతుండగా ముక్కు కింద జిలగా అన్పించింది. చూపుడు వేలుతో రుద్దుకున్నాడు. చేతికున్న చాకోపీసు పొడి తెల్లగా అంటుకుంది. నలుగురైదుగురు విద్యార్థులు కనపడి కనపడకుండా నవ్వారు. దురద తగ్గలేదు. ఇంకో సారి వేళ్లతో ముక్కుకింద రుద్దుకున్నాడు. 'ఇంకా రుద్దితే పిల్లల ముందు బాగుండదు. తక్కిన భాగం స్టాఫ్ రూంలో పూర్తి చేద్దాం' అనుకొన్నాడు. పాఠం మీద మనస్సు నిలవలేదు. స్టాఫ్‌రూంలో కూర్చొని వుండగా మోచేయి మడత దగ్గర దురదగా అన్పించింది. చూస్తే అక్కడ ఎర్రగా కందినట్టు కొంచెం దద్దురు లేచింది. కాసేపు సవరించుకున్నాడు. గోక్కున్నాడు. అయినా దురద తగ్గలేదు. మామూలుగా రమాకాంత్‌ది పాజిటివ్ మనస్తత్వం. అందుకని 'ఇదీ ఒకందుకు మంచిదేలే. ఏమీ తోచనప్పుడు కాలక్షేపం. నా చేతులు, నా కాళ్లు గాబట్టి ఎవరి స్వేచ్ఛ మీదా ఇది దురాక్రమణ కాదు' అనుకున్నాడు.

అయితే ఈ సానుకూల దృక్పథం ఎంతో కాలం నిలవలేదు. తెల్లారి మళ్లీ వాహ్యాళికి వెళ్లొచ్చాడు. దార్లో నిన్నటి నవ్వు మళ్లీ విన్పించింది. గాలిలో సన్నని ఆలాపన. 'ఈ విషయం తీవ్రంగా పరిశీలించాలి. మొక్కలు, చెట్లు నవ్వుతాయేమో, మంచి మూడ్‌లో పాడతాయేమో మనకి తెలీకుండా' అనుకున్నాడు. ఇంటికొచ్చిన రమాకాంత్ పరిశీలన మొదలుకాకుండానే మొహం మీద అక్కడక్కడ ముక్కు మీద, పెదవి కింద, చెవుల పక్కల, మెడమీద సన్నటి దద్దురు ఏర్పడింది. విపరీతమైన దురద. ఆ సాయంత్రం అందుబాటులో ఉన్న డాక్టర్ని కలిశాడు. ఆయన పది 'ఎవిల్' మాత్రలు, 'బెట్నవేట్' ఆయింట్‌మెంట్ రాసి, ఏం ఫర్వాలేదు పొమ్మన్నాడు. అయినా రమాకాంత్ బాధ తగ్గలేదు. రాత్రింబగళ్లు ఒకటే దురద. పదిహేను రోజులకి మళ్లీ మందులు మార్చాడు డాక్టర్. ఈసారి మెబ్రిల్ మాత్రలు. వాటివల్ల కాస్త ఉపశాంతి, ఇంకాస్త నిద్రమత్తు కలిగాయి రమాకాంత్‌కి. దాదాపు మూడు నెలలు తీవ్రమైన బాధ. విసిగిపోయాడు. మెల్ల మెల్లగా ఫిబ్రవరి వచ్చేటప్పటికి వాతావరణంలో వేడి పెరిగింది. మార్చి నాటికి వ్యాధి అయిపు లేకుండా పోయింది. రమాకాంత్ మనస్సు తేలికపడింది. మరింత చురుగ్గా మార్నింగ్ వాక్ కూడా చేస్తున్నాడు.

విచిత్రం. ఆగస్టు నెల నాటికి వ్యవహారం మళ్లీ మొదటికొచ్చింది. ఈసారి వాహ్యాళి ప్రదేశంలోనే గాకుండా యూనివర్సిటీ ఆవరణంతా నవ్వులు, అస్పష్టగానాలు వినబడసాగాయి. రాత్రి నిద్రలోను ఆ గానం వెంటాడుతుంది. మొహం, కాళ్లు, చేతులు మళ్లీ గట్టిగా స్పందించాయి. దద్దురు, దురద. ఈసారి మందులవల్ల పెద్దగా ఉపశమనం లేకపోగా వ్యాధి వికటించింది.

ఒక రాత్రి గడ్డం మీద తడితడిగా తగిలింది. మొహం ఏడవటం అదే మొదలు. అప్పటి నుంచి రమాకాంత్ మనశ్శాంతి కోల్పోయాడు. మిత్రుల సలహా మీద ఒక పెద్ద

హోమియోపతి వైద్యుడి దగ్గర చిన్న చిన్న గుళికలు మింగాడు. ఇంకో చిన్న ఆయుర్వేద భిషగ్వరుడి వద్ద పెద్ద పెద్ద ఉండలు. ఫలితం శూన్యం. ముఖ రోదనం మాన్పటం ఎవరివల్లా కాలేదు. అయితే మళ్లీ మార్చి నెల నాటికి వ్యాధి మటుమాయమైంది. మొహం, చేతులు మాత్రం కాస్త నల్లబడ్డాయి. రమాకాంత్ ఊపిరి పీల్చుకున్నాడు. యథావిధిగా శ్రావణ మాసం నాటికి పరిస్థితి మునుపటి కన్నా విషమించింది. వాళ్లని వీళ్లని విచారిస్తే నగరంలో పెద్ద పేరు మోస్తూ నమ్మకంగా చర్మవైద్యం చేస్తున్నది డాక్టర్ వ్యాసప్రసాదమే అని తేలింది. బాధ భరించలేని పరిస్థితిలో ఆయన్ని వేడుకున్నాడు రమాకాంత్. "తప్పదు డాక్టరుగారూ! ఈ బాధ భరించలేను. ఎట్లాగైనా మీరు నా మొహం మార్చాల్సిందే!".

❖ ❖ ❖

డాక్టర్ వ్యాసప్రసాదం డబ్బు మనిషి కాదు. రోగి, రోగం పూర్వాపరాలు పరిశీలించకుండా ఏవో మందులు గిలికేసే రకం కాదు. ఆయన రమాకాంత్ సమస్యను సవాలుగా తీసుకున్నాడు. రమాకాంత్ మళ్లీ కలిసినప్పుడు వ్యాధి నిలకడగా ఉన్నా ఏ మాత్రం తగ్గలేదని గమనించాడు. రోగిని ఇంకొన్ని వ్యక్తిగత వివరాలు అడిగాడు. అతనికి సరిపడేవి, సరిపడనివి అడిగి తెలుసుకున్నాడు. ఇంటి వాతావరణం, యూనివర్శిటీ వాతావరణం గురించి తెలుసుకున్నాడు. ఎక్కడా ఏ విధమైన 'క్లూ' లభించలేదు. అవే మందులు కొనసాగించమని చెప్పి మళ్లీ వారానికి రమ్మన్నాడు. రమాకాంత్ నిరాశగా వెనుదిరిగాడు.

"ఇంకో డాక్టరు దగ్గరికైనా వెళ్లి ఆ మొహమేదో మార్పించుకోండి. ఇంటిల్లిపాది చూళ్లేక చస్తున్నాం" అంది ప్రమీల మొహమాటం లేకుండా.

వ్యాస ప్రసాదం మెడికల్ జర్నల్స్ తిరగేశాడు. ఇంటర్నెట్ నుంచి రకరకాల సమాచారం 'కాపాడి', పరిశీలించాడు. ఏ అంతు చిక్కలేదు. 'శ్రావణమాసం' అనే మాట మాత్రం ఎందుకో ఆయన మనస్సులో నిల్చిపోయింది. మళ్లీ శనివారం రమాకాంత్ కలిసినప్పుడు ఆయనేమంత హుషారుగా లేడు. ఇంతవరకు ఏ కేసులోను తాను ఓడిపోలేదని, ఇది మాత్రం చాలా విచిత్రంగా ఉందనీ అన్నాడు. "అన్నట్టు శ్రావణమాసంలో ఏం జరుగుతుంది?" హఠాత్తుగా అడిగాడు.

"ఏముంది? వానలు పడతాయి, పడుతున్నాయి గదా?"

"ఈ కాలంలో మీ పద్ధతుల్లో ఏవైనా మార్పులు కలుగుతుంటాయా?"

"ఏం లేదే? వానాకాలం కూడా మామూలుగా 'ఉదయ - నడక'కు వెళ్తుంటాను" చెప్పాడు రమాకాంత్. 'మార్నింగ్ వాక్'కు బదులు చక్కని తెలుగు మాట వాడితే డాక్టర్ సంతోషిస్తాడనే ఉద్దేశంతో. అయితే వ్యాసప్రసాదానికి ఆ దుష్ట సమాసం రుచించక ఒక్కసారి తల విదిలించాడు.

"ప్రత్యేకించి ఈ కాలంలో నేను ఆరుబయట నడుస్తున్నప్పుడు కొన్ని మొక్కలు

నవ్వుతున్నట్టు అనుమానం కలుగుతోంది. నన్నులజడి పెట్టే పాట కూడా ఏదో వినపడుతుంది. ఈ సమాచారం మీకు అవసరం లేకపోవచ్చు" అనుమానిస్తూ చెప్పాడు రమాకాంత్.

"గుత్తులు గుత్తుల తెల్లపూల నవ్వులేనా? అర్థం గాని సంగీతమేనా?"

"అవును."

"ఎక్కడెక్కడ విన్పిస్తున్నాయి?" కుతూహలంగా అడిగాడు వ్యాస ప్రసాదం.

"ఆరుబయట ఖాళీ ప్రదేశాలన్నిటా. యూనివర్సిటీ ఆవరణలో. మా ఇంటి చుట్టుపక్కల గూడా ఈ మధ్య విన్పిస్తున్నాయి. బయటికి వెళితే చాలు."

"యురేకా!" అని వ్యాస ప్రసాదం పెద్ద పులిలాగా అరిచి, "పిచ్చి బంతి లేదా కాంగ్రెస్ గ్రాస్." అన్నాడు రమాకాంత్ కళ్లల్లో కళ్లుంచి.

"అ రెండోముక్క అర్థం గాలేదు."

"ఒయ్యారి భామ!"

"?"

"పార్థీనియం!"

రమాకాంత్ ఏడుపు ముఖం పెట్టాడు. "ఇప్పటిదాకా నా రోగమే నాకర్థం గావటం లేదనుకుంటే ఇప్పుడు మీ మాటలూ అర్థం గావటం లేదు డాక్టర్ గారూ!"

"అది 1956వ సంవత్సరం." అంటూ గతంలోకి వెళ్లిపోయాడు డాక్టర్. అతని మొహంమీద వలయాలు తిరగటం చూశాడు రమాకాంత్.

"అమెరికన్ కాంగ్రెస్ వాళ్ల మనదేశం మీద కరువుదయతో గోధుమ బస్తాలు పంపారు. వాటితో కలిసిపోయి బీజరూపంలో ఒక విషకన్య కూడా మనదేశంలో అడుగుపెట్టింది. శరవేగంగా తన సంతతిని పెంచింది. 1980 తర్వాత ఇక్కడ బాగా వ్యాప్తి చెందింది. మూడు నాలుగడుగుల ఎత్తు వరకు పెరిగి తెల్ల తెల్ల పూలతో నంగనాచి మొక్కలాగా నవ్వుతుంది. తెలీని పాటలు పాడుతుంది. వేలంతా తన బీజాలు వెదజల్లుతుంది. ప్రపంచంలోని పదిరకాల విషకన్యల్లో ఇదొకటి"

'అమ్మో!" భయపడ్డాడు రమాకాంత్.

"దాని నవ్వులు, పాటలు శ్రావణమాసంలో మొదలవుతాయి. అందరికీ అవి వినపడవు. కొంత మందికి కొద్దిగా. మరీ సున్నితంగా స్పందించే మీలాంటి వాళ్లకే ప్రమాదకరంగా వినపడతాయి. ఆ అస్పష్టగానం వినపడ్డవాడు దురదృష్టవంతుడు. మీకు దాని గాలి సోకింది. దానికి శాశ్వతంగా దూరం పోవటం తప్ప విరుగుడు లేదు. కానీ ఇల్లు చుట్టుపక్కలు, విశ్వవిద్యాలయ పరిధి దాటి ఎక్కడికని పోతారు? దురదృష్టంలో అదృష్టం. మీకు ఉబ్బసం రాలేదు. కేవలం ఎలర్జీయే. కారణం ఒయ్యారి భామే" అన్నాడు డాక్టర్ తన పరిశోధన ఫలించిందన్న ఉద్వేగంతో.

"దీనియమ్...." అని రమాకాంత్ అచ్చతెలుగులో కోప్పడబోతుంటే "కాదు, పార్థీనియమ్. దానికే రకరకాల పేర్లు." అన్నాడు డాక్టర్.

"అయితే నేను మొహం మార్చుకునే పని లేదా?" ఆశగా అడిగాడు రమాకాంత్.

"చెప్పలేను. ఇంతవరకు దానికి విరుగుడు కనిపెట్టలేదెవరూ. కొన్ని మందులు వాడి చూద్దాం. దాని సమ్మోహనగానం పెద్దగా వినపడనంతగా మీ వినికిడి తగ్గించే ప్రయత్నం చేతాం."

అయితే వ్యాస ప్రసాదం ప్రయత్నం ఫలించలేదు. రమాకాంత్‌కి ఎప్పటిలాగే ఒయ్యారిభామ నవ్వులు, పాటలు వినపడుతూనే వున్నాయి. వ్యాధి లక్షణాలు తగ్గుముఖం పట్టలేదు. చివరికి రోగి కోరిక ప్రకారం డాక్టర్ ఆపరేషన్ నిర్ణయం తీసుకున్నాడు. రమాకాంత్ మొహం మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతంగా జరిగింది. అది తన మొట్టమొదటి మొహం మార్పిడి శస్త్ర చికిత్స అయినా అందులో రెండు వందల శాతం నైపుణ్యం చూపించాడు వ్యాస ప్రసాదం. తన ప్రతిభకి తానే ఆశ్చర్యపోయాడు. పత్రికలు కూడా ఆ అరుదైన శస్త్ర చికిత్సని వేనోళ్ల పొగిడాయి.

❖ ❖ ❖

రమాకాంత్ ఆసుపత్రి నుంచి ఇంటికొచ్చి తలుపు తట్టాడు. తలుపు తీసిన ప్రమీల పరాకుగా చూసి, చిరాకుగా అంది, "ఆయన ఇంట్లో లేరండీ!" అని.

రమాకాంత్ బిత్తరపోయాడు. అప్పుడు గమనించింది ప్రమీల.

"అయ్యో నా మతి మండా! నిజంగా మీరేగా?" అని నొచ్చుకొని లోపలికి పిలిచింది. ప్రేమగా దిష్టి తీసింది. "పోతే పోయిందిలెండి వెధవ మొహం." అంది.

"తప్పు. వెధవ మొహం అంటే వెధవ యొక్క మొహం అని అర్థం." అన్నాడు రమాకాంత్ చిన్నబుచ్చుకుంటూ.

"పోనీలెండి. ఇప్పుడెంత ముద్దొస్తున్నారో" అని మెటికలు విరిచింది ప్రమీల.

"థాంక్యూ డాడీ! పాత మొహం ఆడుకోటానికిచ్చినందుకు" అంది ముద్దుగా అనుపమ.

రమాకాంత్ అద్దంలో అనేక భంగిమల్లో మొహం చూసుకొని తానే ఆశ్చర్యపోయాడు. 'ద డాక్టర్ ఈజ్ గ్రేట్, అయామ్ సో క్యూట్' అని మెచ్చుకున్నాడు. 'లలలా! లలలా!' అంటూ హుషారుగా కూనిరాగాలు తీశాడు. విషయం తెలీని కొందరు మిత్రులకి ఫోన్ చేసి మరీ చెప్పాడు.

యూనివర్శిటీకి ఇంకా వారం రోజులు తన సెలవుంది. ఏమీ తోచక మూడోరోజు బజారు వెళ్లాడు. శంకర్ విలాస్ సెంటర్‌లో ఒక మిత్రుడు తారసపడ్డాడు.

"ఒరే రమాకాంత్!" అంటూ దగ్గరికి వచ్చి, ఎగాదిగా చూసి, "సారీ అండీ! మా వెధవాయ్

అనుకున్నా" అని వెళ్లిపోబోయాడు.

రమాకాంత్ "హి! హి!" అని రవ్వంత వెర్రిగా నవ్వుతూ అతణ్ణి ఆపి, విషయమంతా చెప్పి, అతనికి సంభ్రమం కలిగించి, తను సంతృప్తి పడ్డాడు. 'ఎన్నేళ్లుగానో కలిసి తిరిగిన మిత్రుడే గుర్తు పట్టలేకపోతే ఇంక ఒయ్యారిభామ నన్ను గుర్తిస్తుందా? ఇక దాని గానం నాకు వినపడదు గాక వినపడదు.'

రమాకాంత్ ఆశావాదం ఎన్నో రోజులు నిలవలేదు. శస్త్ర చికిత్స జరిగిన పది రోజులకి ఇనుమడించిన ఉత్సాహంతో ఉదయ వాహ్యాళికి బయల్దేరాడు. ఎంత దూరం నడిచినా ఎక్కడా అవాంఛనీయ శబ్దాలు వినరాలేదు. 'సక్సెస్, గ్రాండ్ సక్సెస్' అని పెద్దగా పైకే అనేశాడు, తెలుగు సినిమాల్లో చివరికేదో కనిపెట్టిన సైంటిస్టులాగా. అంతలో వెనుకనుంచి కిసుక్కుమన్న సవ్వడి వినపడింది. రమాకాంత్ బిక్కచచ్చిపోయాడు. సందేహం లేదు, అది ఒయ్యారిభామ నవ్వే. ఆ తత్తరపాటులో ఇంటికెట్లా తిరిగొచ్చాడో తనకే తెలీలేదు.

'ఇదంతా నా భ్రమేనేమో' అనుకున్నాడు కాస్త స్థిమితపడ్డాక. 'పోనీ రేపు మళ్లీ చూద్దాం.'

తెల్లారీ అదే పరిస్థితి. ఎటు వెళ్లినా ఖాళీ ప్రదేశాల్లో, యూనివర్సిటీ ఆవరణలో, పిచ్చి మొక్కల్లోంచి నవ్వులే నవ్వులు. పాటలే పాటలు. పరిహాసంగా, అవమానకరంగా. నిద్రలోను అదే సమ్మోహనగానం. మళ్లీ ఒంటిలో మార్పు. రెండు రోజుల్లో మొహం మీద, గొంతుమీద సన్నటి ఎర్రటి దద్దురు వచ్చింది. వారం తిరిగేపాటికి కొత్త మొహం పాత మొహం మల్లేనే సన్న సన్నగా ఏడవటం మొదలు. రమాకాంత్ ఆవజీవాలు కుంగిపోయాయి. ఆ సాయంత్రం మళ్లీ డాక్టర్ దగ్గరికి పరిగెత్తాడు. అతనిని చాల జాగ్రత్తగా పరీక్షించి పెదవి విరిచాడు వ్యాస ప్రసాదం.

"ఏమీ పాలుపోవటం లేదు రమాకాంత్! బహుశ నా శక్తి యింతవరకే. ఇంతకు మించి మీ మొహాన్ని ఎట్లా ఓదార్చాలో నాకర్థం గావటం లేదు. మళ్లా మొహం మార్చటం కూడా సాధ్యం కాదు. అయితే ప్రతి సమస్యకీ ఎక్కడో ఏదో పరిష్కారం ఉంటుంది. అది తెలిసేదాక ఈ యాతన తప్పదు. నిరుత్సాహపడకండి. చూతాం" అని ఏవో కొన్ని మందులు మార్చి రాశాడు.

ఇల్లు చేరింతర్వాత సోఫాలో జారబడి, చాలా విచారించాడు రమాకాంత్. ఆ తర్వాత ఏదో నిర్ణయానికి వచ్చాడు. డబ్బాలో దూది తీసి, రెండు చెవుల్లో పెట్టుకున్నాడు. భార్య, కూతురు ఆశ్చర్యపోతుండగా బయటికి నడిచాడు. ఎటు చూసినా ఖాళీ స్థలాల్లో ఒయ్యారిభామలే.

"ఏది ఏమైనా సరే ఈ భూమిమీద ఒయ్యారిభామల నవ్వులు వినిపించకుండా వాటి పీక పిసికేస్తాను. విజయమో, వీర వ్యాధియో!" అని నిర్ణయించుకున్నాడు. ఒక్కొక్క ఒయ్యారి భామనీ గొంతు దగ్గర పట్టుకొని లాగేస్తున్నాడు. దారిని పోయ్యేవాళ్లు నివ్వెరపోతున్నారు. కర్ణకఠోరంగా గరళగానం వినపడుతూనే వుంది. రమాకాంత్ వాటి గొంతు పిసికేస్తూనే వున్నాడు.